వ్యంగ్య రచన

# దేవుడే దిగి వస్తే...

రామవరపు గణేశ్వరరావు

డోర్ బెల్ మోగటంతో తెలివి వచ్చింది. మా ఆవిడ తలుపు తీయడం, మిసెస్ జస్పాల్ గొంతుక వినిపించింది. ఆవిడని అందరూ 'సాటిలైట్' అని పిలుస్తుంటారు. మా ఆవిడతో, గొంతు తగ్గించి, ఏదో రహస్యం చెప్తున్నట్లు చెప్తోంది. ఆవిడ తన గొంతుక పూర్తిగా విప్పిందంటే, ఎదుటి వారి చెవులు చిల్లులు పడాల్సిందే!

నిద్ర ముంచుకు రావటంతో, ఆమె మాటలు వినాలన్న కుతూహలం పోయింది. మొఖం మీద నీళ్ళు చిలకరించి, నారెండు భుజాలు పట్టుకుని మా ఆవిడ కుదపటంతో, మంచం మీద నుంచి లేవక తప్పలేదు. టైము చూస్తే, తీరా ఆరేనా కాలేదు.

"అరగంట నుంచి మిమ్మల్ని లేపలేక చస్తున్నాను. వెంటనే వెళ్ళి, పాలు తీసుకొనిరండి. వినాయకుడికి పాలు పట్టాలి!" అని మా ఆవిడ అనడంతో, ఈ హడావిడి అంతా పాలకోసం అని తెలిసింది. అయితే వినాయకుడెవరు?

"ఎవరో ఏమిటండీ సాక్షాత్తు ఆ దేవుడే! అన్ని దేవాలయాల్లోనూ శివుడు, గణపతి, నంది భక్తులిస్తున్న పాలు తాగుతున్నారట! మన కాలనీ వాళ్ళు చాలా మంది వెళ్ళి వచ్చారని మిసెస్ జస్పాల్ ఎప్పుడో చెప్పింది. మనదే ఆలస్యం!" అంది.

"అదిసరే కాని వినాయకుడు పాలు త్రాగడమే మిటి? మొన్న చవితికి ఉండ్రాళ్ళు, కజ్జికాయలు కదా చేసావ్!" అన్నాను.

"మూడు రోజుల క్రితం వంకాయ ఉల్లికారం పెట్టి చేస్తే, లొట్టలు వేసుకుని తిన్నారా? మొన్న, నిన్న అదే కూర చేస్తే, మీరు వాంతి చేసుకోలా! మూడు రోజులు ఒకే కూర మీకు పడకపోతే, వందల సంవత్సరాల నుంచి అవే ఉండ్రాళ్ళను తినమంటే ఆ బొజ్జ గణపతి మాత్రం ఎలా తింటాడండీ. మీది మరీ విడ్డూరం!" అని మా ఆవిడ అనడంతో, హాలా హలం త్రాగిన శివుడుకి, చివరకి గడ్డితినే నందికి కూడా పాలే కావలసి వచ్చాయా అని అడుగుదామనుకున్న మాట నోటిలోనే ఉండిపోయింది. నయం, క్షీరసాగరంలోని విష్ణువు పాలు త్రాగడం మొదలు పెట్టలేదు!

ఆ దేవునికే పాలు పట్టి తరించే అదృష్టం మాలాటి సామాన్యులకు కలిగిందన్న ఆనందంలో, ఆదరాబాదరాగా తయారై, ఆ చీకట్లోనే పాల డిపోకు పరుగెత్తాను.

నాలాగే మా ఇరుగూ పొరుగూ పాలకని పరుగులు తీస్తూ కనిపించారు. ఎక్కడ చూసినా హడావిడే! 'హలో' అని పలకరిద్దామన్నా, ఆగే స్థితిలో ఎవరూ లేరు. పాలకోసం చాంతాడంత క్యూ! తెల తెలవారు తోంది.

లైను ఎంతకీ కదలదేమని అనుకున్నంతలో, లైను మొత్తం చెదిరిపోయింది. డిపోలో పాల స్టాకు అయిపోయింది! అందరూ పాల డైరీల వేపు పరిగెత్తారు. ఆ రన్నింగ్ రేస్‌లో నేనూ పాల్గొన్నాను. అరడజను చోట్ల, ఆశాభంగం అయ్యాక, ఒకచోట ఒక లీటర్ పాలు వందకి దొరికాయి.

దేవాలయాల్లో దేవుళ్ళు పాలుత్రాగుతున్నారన్న వార్త కార్చిచ్చులా వ్యాపించడంతో, పాలకోసం జనం ఎగబడటంతో, పాల రేటు అలా ఆకాశాన్నంటిం దన్నమాట!

"యాదవ్‌జీ లీటరు పది అయితే, పది రెట్లు రేటు పెంచావ్! ఈ పాలు నా కోసం కాదు, దేవుని కోసం అని తెలిసీ నువ్విలా చేయడం ఏమన్నా న్యాయంగా ఉందా?" అని ఏడవలేక, ముఖాన్న చిరునవ్వు పులుముకుని అడిగాను.

పాలవాడు మాత్రం తక్కువ తిన్నాడా!

"ఔను సార్! అందుకే వంద! మేము దేవుడికి పోయాల్సిన పాలు సార్ మీకిచ్చినవి! అంటే మాకు రావలసిన పుణ్యాన్ని ఒక వందకే మీకు ధారపోసాం కదా!" అన్నాడు.

వెధవ, అబద్ధాలాడినందుకు తిన్నగా నరకానికి పోతాడు. లీటర్ పాలు సంపాదించడానికే రెండు గంటలు పట్టింది. అవి కూడా దొరక్క, తలలు వేలా దేసుకుని ఖాళీ గిన్నెలతో, వెళ్తున్న చాలా మందిని చూసాక పోయింది వందే కదా అని అనుకున్నాను.

మా ఇంటి బయట మా పిల్లలిద్దరూ రెడీగా స్కూల్ బస్ కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. మా ఆవిడ టెలిఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతోంది. లీటర్ పాలకి నేను వంద ఇచ్చానని తెలిసి, పాలు కావాలని వచ్చిన మిసెస్ పాండేకి అందులో సగం ఇచ్చి వంద వసూలు చేసేసింది మా ఆవిడ. చెంబు, చెంచాతో, ఆ పాచి మొఖం తోనే నన్ను బయలుదేర దీసింది. పిల్లలకి 'టాటా' చెప్పి రెండడుగులు వేసాక, గుడికి వాళ్ళని కూడా తీసికెళ్తే బావుంటుందేమో అని అనిపించింది. మళ్ళీ ఇటువంటి అవకాశం వాళ్ళ జీవితాల్లో వస్తుందా?

'ఏడ్చినట్లే ఉంది మీ తెలివి? నేను చేసిన నోముల వల్లనేగా మొన్న మీకు ఆఫీసరుగా ప్రమోషన్ వచ్చింది! మనం సంపాదిస్తున్న పుణ్యం మన పిల్లల్ది కాదూ!" అంది మా ఆవిడ.

దాంతో నా కళ్ళు తెరుచుకున్నాయి. షేర్లలో పుణ్యం కూడా ట్రాన్స్‌ఫర్ కావటంలా! మా అమ్మా నాన్నల పుణ్యం నాకు, నా పుణ్యం నా పిల్లలకి! వాళ్ళు గుడికి రావడం దండుగ. అదీగాక అర లీటరు పాలు వాళ్ళకి కూడా పంచడం వీలవుతుందా?

ముందుగా బిర్లామందిర్, అక్కడి నుంచి శివాలయం, హనుమాన్ మందిర్, సిద్ధి వినాయకుని గుడి. అయితే ఎక్కడికి వెళ్ళినా ఇసుక వేస్తే రాలనంత జనం! ఒంటి గంటలోగా ఆ గుడిలో అడుగు పెట్టే అదృష్టం అగుపించలేదు. ఇంతలో నాకు మా 'దేవుడు' గుర్తుకొచ్చాడు.

మా దేవుడంటే నేను మహాబలిపురం నుంచి విగ్రహం కొనుక్కొచ్చి, ఆ గుడి అక్కడ కట్టడంలో సాయం చేసానన్నమాట. ఆ ఊరికి వచ్చిన కొత్తలో మేమూ మారుమూలనున్న ఆకాలనీలో ఉండేవాళ్ళం. అద్దె తక్కువ అయినా ఇల్లు సదుపాయంగా ఉండేది. అయితే ఇంటి ముందున్న మైదానం ఛండాలంగా ఉండేది. ఆ జాగా ప్రభుత్వానిది. వారు ఏ శతాబ్దంలో ఏమిటి అక్కడ కడతారో కాని, ముందుగా గుడిసెలు లేవడం అందులోని జనం ఆ జాగాని నానా విధాలా ఉపయోగించడం జరిగింది!

నేను మా కాలనీ వాళ్ళతో కలిసి, చేతి చమురు వదిలించుకుని, గుడిసెలు ఖాళీ చేయించి, మళ్ళీ ఇంకోసారి అక్కడికి రాకుండా, వినాయకుడి గుడి అంచెలు అంచెలుగా కట్టించాం. ఒరిస్సా నుంచి ఉద్యోగం కోసం వచ్చి రోడ్లు కొలుస్తున్న మహంతి ఆ జాగాకి మొదట్లో వాచ్‌మేన్. వాడే తరువాత ఆ గుడి పూజారి అయ్యాడు.

అక్కడ కూడా జనం అంతో ఇంతో ఉన్నారు. ఒంటి గంటలోపు లైను మాదాకా వస్తుందా రాదా అని అనుకుంటుండగా, మహంతి కొడుకు ఆ దేవుడే పంపించాడా అన్నట్లు, వచ్చి వెనక ద్వారం గుండా లోనికి తీసుకెళ్ళాడు. అలా ప్రత్యేక దర్శనం చేయించినందుకు, వాడో వంద నా దగ్గర గుంజాడు, అది వేరే సంగతి!

గణపతి విగ్రహం పాలలో మునిగి ఉంది. క్రింద సగం పూలదండలతో కప్పారు. దేవుడి మహత్తు గురించి మహంతి మధ్య మధ్యలో ఉద్రేకంగా అందరితో చెప్తున్నాడు. ఒక్కొక్కరిచేతా ఒక చెంచా పాలు మాత్రమే దేవుడి విగ్రహానికి పోయిస్తూ, తొందర తొందరగా అందరినీ బయటకి తరుముతున్నాడు.

"ఏవండీ! నా చెంచాలోని పాలు వినాయకుడు త్రాగటం లేదండీ!" అని నా ముందున్న మా ఆవిడ గొణిగింది.

"ఏమిటా పిచ్చి మాటలు? అందరి దగ్గరా పాలు త్రాగుతున్న దేవుడికి నీ చెంచా పాలే ఎక్కువ య్యాయా? ఇంకా నయం, మన భాష ఈ ఉత్తర దేశస్థులకి అర్థం కాదు. అది తెలిస్తే, పాపాత్మురాలివని రాళ్ళు వేసి నిన్ను ఇక్కడకిక్కడే చంపేసేవారు. చెంచాని క్రిందకి బాగా వంచు," అని కసిరాను.

"ఆ! ఇప్పుడు త్రాగుతున్నాడండోయ్! వెధవది, ఇద్దరి పిల్లలకు పాలు పట్టిన నేను చెంచాతో సరిగ్గా పట్టకుండా ఎలా తప్పు చేసానో!" అంది. నా చెంచా లోని పాలు దేవుడు తాగాడో లేదో, ఆ దేవునికే ఎరుక! అది చూసే అవకాశం లేకుండా, నా వెనక నున్న వారు నన్ను ముందుకు నెట్టారు!

ఇంటి దగ్గర మా ఆవిడను డ్రాప్ చేద్దామని వచ్చిన నేను, మా కాంపౌండులోని గణపతి బొమ్మ

ముందున్న జనాన్ని చూసి, నన్ను నేను తిట్టుకున్నాను అందుగలడు, ఇందులేడు అన్న సందేహంతో, అడ్డా ల్లోని బిడ్డడ్ని పరచి ఊరంతా వెదికిన అమ్మలా, ఎక్కడెక్కడో తిరిగి ఓ వందరూపాయల పెట్రోలు తగలేసి నందుకు!

మా ఇంటికి ఎదురుగా ఓ రోడ్డు పోతుండడం వలన మా ఇల్లు కట్టిన కాంట్రాక్టరు 'రోడ్డు శూల'అని, ఆ బొమ్మ పెట్టాకే తన పని ప్రారంభించాడు. అది ఇప్పుడు ఈ విధంగా పనికొచ్చింది. మా 'పర్సనల్' దేవుడు కూడా పాలు త్రాగడం చూసాక, మా ఆవిడ మూర్ఛపోయినంత పనిచేసింది.

నేను కూడా ఆ హుషారులో, ఆఫీసుకెళ్ళి ఆ మొక్కుబడి కాస్తా తీర్చుకుని ఇంటికొచ్చి మా దేవుడికి ఇంకొంచెం పాలు పడ్దామని ఆఘమేఘాల మీద చేరుకున్నాను. ఆఫీసులో ఉన్నది ఒకే ఒక్క శాల్తీ - వాడే, అరవాముదన్ వాడికి దేవుడూ లేడు, దెయ్యమూ లేదు. నన్ను చూస్తూనే, అంతా అర్థం అయినట్లు ఓ వెకిలి నవ్వు నవ్వాడు.

ఒక్కొక్కరూ ఆఫీసుకు రావడం, ఒక కొత్త కబురు మోసుకు రావటం జరిగింది. ఖన్నా వస్తూనే, బి.బి.సి.లో కూడా ఇండియన్ గాడ్స్ పాలు త్రాగు తున్నారన్న వార్త వచ్చిందని చెప్పాడు. దానికి, "బి.బి.సిలు ఎ.బి.సిలు ఎంత పిచ్చి వార్తయినా చెప్పక మానరు, అయితే నిజమో అబద్ధమో అన్న సర్టిఫికేటు మాత్రం వాళ్ళెవరూ ఇవ్వరు!" అని అర వాముదన్ అడ్డంగా కూసాడు.

"స్వామిజీ ఇలా జరుగుతుందని నిన్నే అన్నారుట!" అన్న కబురు కపూర్ తీసు కొచ్చాడు.

"ఔను మరి - ఆయన దేవుడి ఏజంటు కదా! దేశంలో పనీపాటా లేని గోచీపాత రాయుళ్ళంతా ఆస్వామికి బ్రోకర్లే!" అని అరవాముదన్ ఎక్క సక్కెంగా అన్నాడు.

ఆ జస్పాల్ సాటిలైట్ మా కాలనీ అంతా కాక, ఇంకెంత మందికి స్వామిజీ సందేశం చెప్పిందో తెలీదు. మరి మా ఆవిడ రెండు గంటలలో కనీసం ఓ వందమందికైనా ఫోన్లు చేసి ఉంటుంది. అంటే వీళ్ళు స్వామిజీ బ్రోకర్లనా అర్థం? నాకు ఒళ్ళు మండింది. వెధవ, స్వామిజీని అన్నందుకు పురుగులు పట్టిపోతాడు. ఆఫీసులోనే ఉంటే, ఇలాగే అవాకులు చవాకులు వాగుతాడని, బేంకు పని చేసు కుని రమ్మని అరవాముదన్‌ని బయటకు తరిమాను.

మొత్తం మీద ఆ రోజు ఆఫీసులో పనేం జరగలేదు. కబుర్లతోనే సరిపోయింది. అన్ని ఆఫీసుల్లోనూ అదే జరిగిందట! ఇంటికొచ్చాక, స్కూళ్ళన్నీ మూసేసినట్లు తెలిసింది.

"నాన్నా, మా ప్రిన్సిపాల్ మేడంకి చండీఘర్ నుంచి పిల్లల్ని ఏ గుడికి తీసుకెళ్ళాలో కూడా, నిన్న రాత్రే ఫోన్ వచ్చిందట! పది కల్లా అన్ని క్లాసుల పిల్లలం, టీచరుతో వెళ్ళాం!" అన్నాడు మా చిట్టిగాడు.

"అయితే బభ్రువాహనా, నువ్వు కూడా దేవుడికి పాలుపట్టావా?" అని అడిగాను.

మా వాడి పేరు అది అనుకునేరు. కాదు, వాడికి మేం పెట్టిన పేరు వీర వెంకట సత్యనారాయణ. వాడికి మొదటినుంచి 'హిస్టారికల్'గా మాట్లాడడం అలవాటు! అంటే వాడు మాటల్లో, వున్న పాత చరిత్ర అంతా త్రవ్వి తీస్తాడన్నమాట! ఉదాహరణకి ఎప్పుడైనా వాడడిగింది నేను ఇవ్వలేదనుకోండి, గతంలో అలా నేను ఎప్పుడెప్పుడు చేసానో ఎక్కంలా వల్లిస్తాడు. అందుకే వాడిని అలా రకరకాల పౌరాణిక, చారిత్మాక ముద్దు పేర్లతో పిలవడం నా అలవాటు.

"భలేవాడివి నాన్నా! నాకేం పిచ్చి పట్టిందనుకు న్నావా? టీచర్లేమన్నా అనుకుంటారేమోనని వాళ్లతో వెళ్ళాను. మా ఫిజిక్స్ టీచర్‌ది మట్టి బుర్ర. అతనికే తట్టలేదు - అదంతా కాపిలరీ ఏక్షన్ అని. పాల చెంచాను రాతి బొమ్మకు తగిలించగానే, సర్‌ఫేస్ టెన్షన్‌కి పాలు కిందకి జారుతాయి. విగ్రహాన్ని పాలలో



WRITER AP EB JAO (Retd)
RAMAKRISHNA NAGAR
Plot No. 24
SRIKAKULAM

ముంచేసి, దండలతో కప్పేస్తే అలా జరగడం ఎవరికీ కనిపించదు." అన్నాడు.

"లేకపోతే చెంచాతో పాలు పోయడం ఏమిటి నాన్నా? ఆకలేస్తే, ఆ దేవుళ్ళకి ఈ కల్తీ పాలే కావల సొచ్చాయా?" అని అందుకుంది మా అమ్మాయి రాణీ రుద్రమదేవి.

మావాడు 'హిస్టారికల్' అయితే అది 'హిస్టెరికల్.' దానికి కోపం వస్తే, చేతిలో ఏది ఉంటే అది విసిరేస్తుంది. అందుకే దాని పేరు లక్ష్మి అయినా, ఝాన్సీ అనో సుల్తానా అనో పిలుస్తూంటాం.

"దేవుళ్ళంతా పాలు తాగుతున్నారని ఎవరో రూమరు తెలివిగా లేవదీస్తే, అందరూ ఔనంటే ఔన న్నారు గొర్రెదాటు జనం! నాన్నా దాన్ని మాస్ హిస్టీరియా అని అంటారు కదూ!" అని అన్నాడు మా కుళోత్తుంగ చోళుడు.

వాళ్ళ మాటలు నేను నోరు వెళ్ళబెట్టుకుని ఆశ్చర్యంగా వింటుంటే, మధ్యలో వచ్చిన మా ఆవిడ పిల్లలిద్దర్నీ దులిపేసింది, 'దేవుడు లేడన్న వారికి పుట్టగతులుండవు' అంటూ.

టి.వి. ఆన్ చేసాను. చెప్పులు కుట్టేవాడు, వాడి ముందున్న ఇనుప సెమ్మెకు పాలు పట్టడం చూపి స్తుంటే, టి.వి. పని చేయడం మానేసింది. నాకు తెలిసిన పద్ధతిలో దానితో అన్ని రకాలుగా కుస్తీలు పట్టినా, బొమ్మ రావటం లేదు.

"ఒరే, బింబిసారా! మన మెకానిక్‌కి కాస్తా ఫోన్ చేసి పిలుస్తావా?" అని టి.వి. ట్యూనర్ తిప్పుతూ మా వాడితో అన్నాను.

"నువ్వుండు నాన్నా! నేను చూస్తా! మనది ఓనిడా టి.వి. సైతానుది! క్షణంలో పనిచేస్తుంది, చూడు!' అని అంటూ ఫ్రిజ్‌లోని నా 'మందు' సీసా తీసి, ఒక చెంచా పోసి టి.వి. ముందు పెట్టాడు.

గాస్ వెలగటం లేదని మా ఆవిడ అరవడం వినిపించగానే, మా చిన్నది, పవళక్కోడి, చెంగున సోఫాలోంచి దూకి, వంటింట్లోకి పరుగెత్తింది.

ఇంతలో టి.వి.లో బొమ్మ ఎంత హఠాత్తుగా పోయిందో, అంత హఠాత్తుగా మళ్ళీ వచ్చింది. లోనుంచి, చేతిలో డాల్డాతో నిండిన చెంచాతో, విజయ గర్వంతో వస్తూ, "గేస్ సిలిండర్‌ని నేనే బాగు చేసాను, మళ్ళీ చక్కగా పనిచేస్తోంది!" అంది మా జిజియా బాయి.

మా టి.వి, గేస్ పనిచేయడంలో, 'మందు,' డాల్డాల మహాత్మ్యం ఏదన్నా ఉందా?

'సార్' అని పిలుపు వినిపించి అటు తిరిగాను. పెయింటర్ కుర్రాడు సైను బోర్డుతో వచ్చాడు. మా రాజరాజ నరేంద్రుడు ఎక్కడి నుంచో తల్లి పాలు తాగుతున్న ఓ కుక్క పిల్లని పట్టుకొచ్చాడు. అది ఎప్పుడు పెద్దదై, మా ఇంటికి పెద్ద దిక్కవుతుందో కాని, మా వాడు ముందుగానే, 'కుక్క ఉంది జాగ్రత్త' బోర్డుకి ఆర్డరిచ్చాడు.

"అన్నట్టు చెప్పడం మరిచాను. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత మన దేవుడు పాలు త్రాగటం లేదని, వచ్చిన జనం ఒకరి తరువాత ఒకరు వెళ్ళిపో యారు. తరువాత చూసుకుంటే, మన కాంపౌండులోని రెండు బకెట్లు, దండెం మీద ఆరేసిన నా చీర, మీ లుంగీ మాయమయ్యాయి!" అని చెప్పింది మా ఆవిడ

వెధవ బకెట్లు, చీర, లుంగీలు! మా ఇంట్లో దైవదర్శనానికి వచ్చిన భక్తాగ్రేసర్లు ఆపని చేసి ఉంటారని నమ్మడానికి నా మనస్సొప్పలేదు.

ఆ బోర్డు గేటుకు వేలాడ దీద్దామని తీస్తే, దాని మీద 'బీవేర్ ఆఫ్ గాడ్' అని రాసి ఉంది!

పెయింటర్ ఎందుకలా రాశాడో ఎవరూ అర్థం చేసు కోకపోయినా, 'స్వరాజ్యం నా జన్మహక్కు' అని గణేశ పూజలకి నాంది పలికిన తిలక్‌లు, రాముడికి ఉండ డానికి ఒక్క గుడేనా - అదీ ఒక్క అయోధ్యలోనే కట్టిం చాలనుకున్న అద్వానీలు తప్పక గ్రహిస్తారనే నా ఆశ.